క్లుప్తంగా

సినీ గాయని శ్రీలలిత సందడి



బాహుబలి కాజాను అందుకుంటున్న శ్రీలలిత

మండపేట: కర్ణాటకకు చెందిన ప్రముఖ గాయని శ్రీలలిత తాపేశ్వరం సురుచి ఫుడ్స్‌లో సందడి చేశారు. జిల్లాలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి వచ్చిన ఆమె సోమవారం సురుచిని సందర్శించారు. సురుచి సిబ్బంది ఆమెకు ఘన స్వాగతం పలికి ఫుడ్స్ అధినేత మల్లిబాబుకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా కాజా తయారీ, సురుచి ఫుడ్స్ నాణ్యతా ప్రమాణాలను వివరించారు. అనంతరం ఆమెను శాలువాతో సత్కరించి బాహుబలి కాజాను అందజేశారు. గాయని శ్రీలలిత తెలుగు, కన్నడ సినీ గీతాలతో పాటు పలు బుల్లితెర ప్రదర్శనల్లో పాటలు పాడి అలరించారు.

విద్యుత్ సరఫరాకు రెండు రోజుల అంతరాయం

మండపేట: రామచంద్రపురం, ఏడిద 132, 33 సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు బుధ, గురు వారాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎస్.రాజబాబు, ఈఈ కె.రత్నాలరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సామర్లకోట ప్రధాన సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా 2, 3 తేదీల్లో ఆయా గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రామచంద్రపురం: ఈ నెల 2, 3 తేదీల్లో రామచంద్రపురం, కె.గంగవరం, కపిలేశ్వరపురం, మండపేట, ఆలమూరు, రాయవరం మండలాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్యలో తరచుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రామచంద్రపురం ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామర్లకోట 220 కేవీ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ కంట్రోల్ ప్యానల్స్ వేస్తున్న దృష్ట్యా కలుగుతున్న అసౌకర్యానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ముస్లిం బాలురకు క్రికెట్ కిట్ అందజేత



క్రికెట్ కిట్ అందజేసిన సయ్యద్ ఫాజిల్

రామచంద్రపురం రూరల్: రంజాన్ పండగను పురస్కరించుకుని మండలంలోని వెలంపాలెంలో షాబాజియా జామియా మసీదులో బాలురకు మసీదు కమిటీ అధ్యక్షుడు సయ్యద్ ఫాజిల్ క్రికెట్ కిట్ అందజేశారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి బాబూలాల్, సభ్యులు షేక్ జమాల్ హుస్సేన్, ఎండీ అలీఖాన్, షేక్ మొహిద్దీన్, షేక్ హుస్సేన్, ఎండీ మోయిన్, షేక్ గౌస్, షేక్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మార్కెట్ వేళల మార్పు

ఆలమూరు: మండలంలోని మడికి అంతర్రాష్ట్ర కూరగాయల మార్కెట్‌లో మార్పు చేసిన సమయ వేళలు మంగళవారం నుంచి అమలు చేస్తున్నట్లు ఆ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పాలూరి సత్తిబాబు వెల్లడించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి వ్యాపారులు, రైతులు వచ్చి కూరగాయలు కొనుగోలు, అమ్మకాలు చేస్తుంటారన్నారు. ఇటీవల అనేక మంది రైతులు, మార్కెట్ కమీషన్‌దారులు సమయ వేళలు పాటించకుండా ఇష్టానుసారం లావాదేవీలు జరపడంతో అనునిత్యం గందరగోళ పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. దీంతో మార్కెట్‌లో ప్రతి రోజు ఉదయం ఐదు గంటల నుంచి, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మాత్రమే విక్రయాలు, సేకరణ ప్రారంభించాలని మార్కెట్ కమిటీ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ సమయాలను అతిక్రమిస్తే రూ.రెండు వేలు జరిమానా విధించనున్నామన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రైతులు, వ్యాపారస్తులు ఈ మారిన వేళలను గుర్తించాలని అధ్యక్షుడు సత్తిబాబు తెలిపారు.

రేపటి నుంచి ఉచిత కోచింగ్

మామిడికుదురు: పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు ఏప్రిల్ 2వ తేదీ బుధవారం నుంచి ఉచిత కోచింగ్ ప్రారంభమవుతుందని బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కోనసీమ జిల్లా అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి కత్రి సుబ్బరాజు సోమవారం తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఈ ఉచిత కోచింగ్ ప్రారంభమవుతుందన్నారు. మామిడికుదురు, రాజోలు, మలికిపురం, కొత్తపేట, అలమూరు, కాట్రేనికోన, అంబాజీపేట, పి.గన్నవరం మండలాల్లో ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పాలిటెక్నిక్, ఏపీ ఆర్‌జేసీ, స్పోకెన్ ఇంగ్లిష్, కెరియర్ గైడెన్స్‌పై అన్ని సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు గుత్తుల వీరబ్రహ్మం, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చొల్లంగి శ్రీధర్ పర్యవేక్షణలో ఈ శిక్షణ జరుగుతుందని చెప్పారు.

విజ్ఞానం.. వినోదం



కపిలేశ్వరపురం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను పరిశీలిస్తున్న పాఠకులు

- సమీపిస్తున్న వేసవి సెలవులు
- గ్రంథాలయాల ప్రాధాన్యతను గుర్తిస్తే మెరుగైన ఫలితాలు
- పుస్తక పఠనంతో విజ్ఞానం, సామాజిక వికాసం
- పోటీ పరీక్షల అభ్యర్థులకు ప్రయోజనం

కపిలేశ్వరపురం: ఇంటర్మీడియెట్ పరీక్షలు పూర్తయ్యాయి. పదో తరగతి పరీక్షలు మరికొద్ది రోజుల్లో పూర్తికానున్నాయి. తర్వాత వచ్చే సెలవులు పట్ల విద్యార్థుల్లో ఆసక్తి సహజంగా ఉంటుంది. విద్యార్థుల వయస్సు, సమాజంలో ఉన్న ధోరణుల కారణంగా సెలవులు అనగానే చదువుకు విరామమన్న భావనతో ఉంటారు. వాస్తవానికి సెలవులు అనేవి విద్యా సంవత్సరం కొనసాగింపునకు విరామమే తప్ప చదువుకు, విద్యార్జనకు ఏమాత్రం సెలవు కానే కాదు. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వైపు, ఇంటర్ పూర్తి చేసుకొన్నవారు తదుపరి విద్యను ఎంపిక చేసుకోవడంపైనా దృష్టి సారించాలి. అందుకోసం కాస్త సమాచారం అవసరం, వాటిని అధ్యయనం చేసేందుకు అనుభవజ్ఞులు, గ్రంథాలయాలు ఎంతగానో ఉపకరిస్తాయి. సెలవులనుకునే విద్యార్థులు వారు ఏ ప్రాంతానికి వెళ్లిన దగ్గరలోని గ్రథాలయాల్లో గడపడం మేలంటున్నారు సామాజిక వేత్తలు..

మండపేట నియోజకవర్గంలో ఒక మున్సిపాలిటీ, 43 గ్రామాలు, రామచంద్రపురం నియోజకవర్గంలో ఒక మున్సిపాలిటీ, 77 గ్రామాలున్నాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో మండపేట పట్టణంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గ్రేడ్-1 గ్రంథాలయం 1, మున్సిపాలిటీ పర్యవేక్షణలో మరొకటి ఉన్నాయి. రాయవరం, మాచవరం, కపిలేశ్వరపురం, అంగర, వెల్ల, ద్రాక్షారామ, పామర్రు, అముజూరు, కాజులూరులో గ్రేడ్-3 గ్రంథాలయాలున్నాయి. వల్లూరులో వీడీసీ గ్రంథాలయం, అర్తమూరు, తాపేశ్వరం, తదితర గ్రామాల్లో ప్రైవేటు గ్రంథాలయాలున్నాయి.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రంథాలయాల అభివృద్ధి

గతంలో ఎన్నడూ లేనివిధంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధికి ఎనలేని కృషి చేసింది. ప్రతి సచివాలయంలోనూ డిజిటల్ గ్రంథాలయాన్ని నెలకొల్పాలన్న తపనతో ప్రణాళికలు సైతం రూపొందించింది. కారణాలేమైనా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. డిజిటల్ గ్రంథాలయాల ఏర్పాటు ప్రక్రియను కూటమి ప్రభుత్వం విస్మరిస్తుంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో ఉమ్మడి జిల్లాలోని గ్రంథాలయాలకు 2021లో రూ.1.22 కోట్లతో 1,06,903 పుస్తకాలను సమకూర్చింది. వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీల పేరుతో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో 223 గ్రంథాలయాలకు భవనాలను నిర్మించేందుకు కార్యాచరణకు ప్రణాళికను సైతం రూపొందించింది. పుస్తకాలను డిజిటలైజేషన్ చేసే ప్రక్రియ అప్పట్లోనే దాదాపు చివరిదశకు చేరుకుంది. సుమారు లక్ష పుస్తకాలను కంప్యూటరైజ్ చేశారు.

రెండు నియోజకవర్గాల్లో గ్రంథాలయాలు ఇలా...

మండలం	గ్రంథాలయం	గ్రేడ్ సంఖ్య
మండపేట అర్బన్	గ్రేడ్-3	- 01
రాయవరం	గ్రేడ్-3	- 02
కపిలేశ్వరపురం	గ్రేడ్-3	- 02
రామచంద్రపురం	గ్రేడ్-1	- 01
రామచంద్రపురం రూరల్	గ్రేడ్-3	- 02
కె.గంగవరం	గ్రేడ్-3	- 02
కాజులూరు	గ్రేడ్-1	- 01

గ్రంథాలయాలతో విజ్ఞానం



విజ్ఞానాన్ని పెంచుకునేందుకు గ్రంథాలయాన్ని ఆశ్రయించడం మేలు. విద్యార్థులు ప్రస్తుత కోర్సు పూర్తి చేసుకున్న తర్వాత భవిష్యత్‌కు ఉపకరించే కోర్సును ఎంపిక చేసుకోవడం గొప్ప మలుపు. గ్రంథాలయాల్లోని కరెంట్ అఫైర్స్, విద్యా పేజీలను చదువుకోవడం మంచిది.

గండి స్వామి ప్రసాద్, ఉపాధ్యాయులు, మండపేట

సామాజిక అంశాలను అధ్యయనం చేయాలి



సహజంగా సెలవులు అనగానే స్వేచ్ఛగా నచ్చినట్టు తిరగడం అనే భావన సరికాదు. ఖాళీ సమయాన్ని కుటుంబ సభ్యులతో మమేకం కావడం, బంధువుల నివాసాలను సందర్శించడం, స్నేహితులను పలకరించడం మానసిక వికాసానికి ఉపకరిస్తాయి. వాటితో పాటు సామాజిక అంశాలకు చెందిన పుస్తకాలని అధ్యయనం చేయడం వల్ల సమాజాన్ని అర్థం చేసుకొనే సమర్థత కలుగుతుంది.

కృష్ణశ్రీ, రామచంద్రపురం

విజృంభిస్తున్న ఎండలు



నిర్మానుష్యంగా మారిన పామర్రు ప్రధాన రహదారి

కె.గంగవరం: ఈ నెల మొదటి వారం నుంచి ఎండలు విజృంభించడంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. గత రెండు రోజులుగా నియోజకవర్గంలో అధిక ఉష్ణోగ్రత నమోదు కావడంతో జనం ఇళ్లకే పరిమితమవుతున్నారు. దీంతో పలు గ్రామాల్లో జన సంచారం లేక రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. గతంలో ఎన్నడు లేని విధంగా మార్చి నెలలోనే ఎండలు విజృభించడంతో బయటకు రావాలంటేనే జనం బెంబేలెత్తుతున్నారు. దీనికి తోడు పంట కాలువల్లో నీరు అంతంత మాత్రంగా ఉండడంతో ఎండ వేడికి పల్లెలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. వడగాడ్పులతో గోదావరి తీర ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారులు, వృద్ధులు ఎండ వేడికి తట్టుకోలేక ఆపసోపాలు పడుతున్నారు. ఎండ తాపం నుంచి ఉపశమనం పొందేందుకు శీతలపానీయాలపై ఆధారపడుతున్నారు. కూల్ డ్రింక్ షాపులు, శీతల పానీయాల దుకాణాలు, జ్యూస్ సెంటర్లు, కొబ్బరి బొండాల వద్ద జనం బారులు తీరుతున్నారు.

క్రీడలతో శారీరక, మానసికోల్లాసం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

మండపేట: క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని ఎంపీపీ డమట్ల శ్రీనివాస్ అన్నారు. ఉగాది సందర్భంగా మండలంలోని కేశవరంలో సోమవారం మాహి మొబైల్స్ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. దాతల సహకారంతో వ్యాయామ ఉపాధ్యాయుడు ముక్కపాటి సూర్యనారాయణమూర్తి సారథ్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ టోర్నీలో పది టీంలు పాల్గొన్నాయి. కూసు రామచంద్రనాయుడు (రాము) జట్టు విజేతగా నిలిచింది. కడగల హేమంత్ టీమ్ రన్నరగా నిలిచింది. విజేతలకు ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్న బాబు, వుండమట్ల తాతాజీ, సొసైటీ మాజీ చైర్మన్ ముక్కపాటి శ్రీను, లారీ అసోసియేషన్ ప్రెసిడెంట్ గంధం నాగసూరిబాబు, వుండమట్ల సురేష్, వుండమట్ల నారాయుడు, యడ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



సత్యనారాయణపురంలో ఆంజనేయస్వామి ఆలయాన్ని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: ఆధ్యాత్మిక చింతనతో కూడిన జీవితం సార్థకమవుతుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. కపిలేశ్వరపురం గ్రామ శివారు సత్యనారాయణపురంలో సోమవారం నూతనంగా నిర్మించిన ఆలయంలో వీరాంజనేయ, సిద్ధివినాయక, రామచంద్రస్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్సీ తోట ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయనకు ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికారు. వేదపండితులు ప్రత్యేక పూజలు చేసి స్వామివార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. మధ్యాహ్నం భారీ అన్నదానం నిర్వహించారు. ఎంపీటీసీ గొల్లపల్లి సోనియా, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కట్టా మురళి, పీతల బంగారం, మాజీ సర్పంచ్ అంగాని నూకరాజు, అరదాని శ్రీదేవి, పిప్పర సంపతరావు, సూరిబాబు, వెంకన్న బాబు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో సమస్యలు దూరం



గొల్లపాలెం కోదండ రామాలయ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని పూజలు చేస్తున్న మంత్రి సుభాష్

కాజులూరు: ఆధ్యాత్మిక చింతనతో మనిషి మానసిక ప్రశాంతతను పొంది సమస్యలకు దూరంగా ఉండగలుగుతాడని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. గొల్లపాలెం శివారు చీకట్లవారిపేట, గుండారం కాలనీలలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయాలలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. రెండు గ్రామాల్లోనూ ఆలయ ప్రారంభోత్సవాలో భాగంగా శనివారం గణపతి హోమం నిర్వహించి, విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాశన తదితర ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆదివారం నూతన విగ్రహాలతో గ్రామ ప్రదక్షిణ, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ఠాపన, శిఖర యంత్రజప హోమాలు నిర్వహించి సోమవారం ఉదయం తొమ్మిది గంటల 24 నిమిషాలకు విగ్రహాలను ప్రతిష్ఠించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం ఆలయం వద్ద నిర్వాహక కమిటీ సభ్యులు భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గుబ్బల ఏసురాజు, స్థానిక నాయకులు డాక్టర్ చంద్రు వీర్రాజుచౌదరి, కోకా హరి, మండల గౌడ సంఘం అధ్యక్షుడు అంగర కృష్ణ, కార్యదర్శి అంగర శ్రీను, అత్తిలి వెంకటరమణ, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

హైకోర్టు బార్ అసోసియేషన్ కార్యదర్శిగా పితాని

మామిడికుదురు: ఏపీ హైకోర్టు బార్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా మామిడికుదురు మండలం పెదపట్నం గ్రామానికి చెందిన పితాని చంద్రశేఖర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని ఆయన సోమవారం స్థానిక విలేకరులకు తెలిపారు. అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 27న జరిగాయన్నారు. ఆ ఎన్నికల్లో తాను జాయింట్ సెక్రటరీగా విజయం సాధించానని చెప్పారు. చంద్రశేఖరరెడ్డిని రాజోలు బార్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



మండపేటలో దీక్ష చేస్తున్న మహిళలు

మండపేట: స్థానిక సత్యశ్రీ రోడ్డులో మద్యం షాపు ఏర్పాటుకు వ్యతిరేకంగా 28, 29, 30 వార్డుల ప్రజలు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు పదో రోజూ సోమవారం కొనసాగాయి. మూడు వార్డులకు చెందిన మహిళలు, పురుషులు దీక్షల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పది రోజులుగా పనులు మానుకుని మండుటెండలో దీక్షలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ప్రజల శ్రేయస్సుతో పని లేదా ?, నిత్యం రదీగా ఉండే జనావాస ప్రాంతాల్లోను మద్యం దుకాణాలను ప్రోత్సహిస్తారా అని ప్రశ్నించారు. ఇళ్ల మధ్య వైన్‌షాపు పెడితే ఊరుకునేది లేదని, ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మద్దూరి దేవి, పసుపులేటి సుహాసిని, గంజా పుష్పలత, గుత్తుల దయామణి, మోరంపూడి సరస్వతి, గుబ్బల వెంకటరమణ, కేతా దేవి, మేడిశెట్టి మంగాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

- మసీదుల్లో ప్రత్యేక పార్థనలు
- ముగిసిన ఉపవాస దీక్షలు



అంగర మసీదులో ప్రత్యేక పార్థనలు చేస్తున్న ముస్లింలు

రాయవరం: రంజాన్ (ఈద్ ఉల్ ఫితర్) వేడుకలు మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో సోమవారం ఘనంగా జరిగాయి. నెల రోజులుగా ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు సోమవారం మసీదుల వద్ద సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరినొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. మతపెద్దలు ఖురాన్ చదివి వినిపించారు. ఉదయం 8 గంటల నుంచే సామూహిక ప్రార్థనలు(నమాజ్) నిర్వహించారు. ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కోరుతూ మౌలానాల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు (దువా) చేశారు. ప్రతిఒక్కరూ సంపాదనలో కొంత మొత్తాన్ని పేదలకు దానధర్మాలు చేయాలని, అలా చేసే వారి పట్ల అల్లా దయ ఉంటుందని మతపెద్దలు సూచించారు. రాయవరం, లొల్ల, వెదురుపాక, చెల్లూరు తదితర చోట్ల ఉన్న మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆదివారం రాత్రి నెలవంక కన్పించిన అనంతరం నెలరోజులుగా చేస్తున్న రంజాన్ దీక్షలు ముగిశాయి. నెలవంకను చూడగానే ముస్లిం సోదరులు సంతోషం వ్యక్తం చేసి ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు ముస్లిం సోదరులకు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రార్థనల అనంతరం స్వీట్లు, డ్రై ఫ్రూట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇమామ్ సయ్యద్ రజా, మత పెద్దలు అహ్మద్‌బాషా, అబూ బక్కర్, ఖాజాబాబు, వల్లీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈదుల్ ఫితర్

కపిలేశ్వరపురం: నిత్యం ఒడిదొడుకలతో జీవితాన్ని ఈడ్చే ప్రజలు అల్లాహ్ కానుకలు కోసం ఆశగా ఎదురు చూసే పండగ రంజాన్ అని అంగర మసీద్-ఎ-ఇబ్రహీం ముతవలి మహ్మద్ అబ్బాస్ హుస్సేన్, ఇమామ్ నాజీం అక్తర్ అన్నారు. ఈ నెల 1 న ప్రారంభమైన సకల శుభాలూ కలిగించే పవిత్ర రంజాన్ మాసం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా అంగరలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హుస్సేన్, అక్బర్ మాట్లాడుతూ మనసును పక్షాళన చేసుకుని నెలవంకను చూడటంతో ప్రారంభమైన నెల రోజులు పాటు జరుపుకున్న రంజాన్ పండుగలో ప్రతి క్షణం ఆధ్యాత్మిక వికాసంతో జీవిస్తారన్నారు. ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసుకుంటూ రోజంతా ప్రణాళికాబద్ధంగా గడపటం ద్వారా మానవ జీవన శైలి క్రమబద్ధ అవుతుందన్నారు. మసీదులో ఈద్ నమాజ్ అనంతరం ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకొంటూ ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. బరియల్ గ్రౌండ్‌నకు వెళ్లి దువాలు చేశారు. కార్యక్రమంలో అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి, నల్లూరు, వల్లూరు గ్రామాల ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

రామచంద్రపురం రూరల్: దివ్య ఖురాన్ అవతరించిన పవిత్ర మాసం రంజాన్‌ను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. రంజాన్ మాసం మొత్తం పవిత్రంగా ఉపవాస దీక్షలు పాటించారు. పవిత్ర రంజాన్ పర్వదినం ఇస్లాం క్యాలెండర్‌లోని 'షవ్వాల్ నెల' మొదటి రోజున ఈద్-ఉల్-ఫితర్ లేక సేమియాల పండగగా పిలుస్తారు. ద్రాక్షారామలోని మూడు మసీదుల్లో సోమవారం ఈద్ ఫైత్రాన్ ప్రార్థనలు, ఫిత్రా దానాలు చేశారు. నమాజ్ అనంతరం పూర్వీకుల సమాధుల వద్దకు ఊరేగింపుగా వెళ్లి తేనీటి విందును ఏర్పాటు చేశారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ముస్లింలు హాజరయ్యారు. పేదలకు దాన ధర్మాలు చేశారు. ఒకరినొకరు కౌగలించుకుని ఈద్ ముబారక్ తెలుపుకొన్నారు. ఈద్ ప్రసంగంలో అందరూ ప్రేమానురాగాలతో జీవించాలని ఇమాంలు పిలుపు ఇచ్చారు. షియా జామియా జాఫరీ మసీదు(పెద్ద మసీదు)లో ఇరాన్‌లో విద్యనభ్యసించి వచ్చిన మీర్జా అస్కరి హుస్సేన్ నమాజ్ చేయించారు. మార్కెట్‌లోని జామియా మసీదులో మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ కాజా మొహిద్దీన్ ఆధ్వర్యంలో మత గురువు ఎండీ తసదుక్‌హుస్సేన్ బోధనలు చేశారు. వెలంపాలెం షబాజియా జామియా మసీదులో కమిటీ అధ్యక్షుడు సయ్యద్ ఫాజిల్ అజారుద్దీన్ ఆధ్వర్యంలో మత గురువు గులాస్ రాజా ఆలం ప్రార్థనలు చేశారు. ఇఫ్తార్, సహరి విందులు ఇచ్చిన వారిని గురించి దువా(వేడుకోలు) చేశారు.

మండపేట: నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లింలు రంజాన్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆదివారం సాయంత్రం నెలవంకను దర్శించుకుని ఉపవాస దీక్షలు విరమించారు. స్థానిక కలువ పువ్వు సెంటర్‌లోని జామియా మసీదు, గాంధీ నగర్‌లోని చిన్న మసీదు, సైథిల్ పేటలోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జామియా మసీదు గురువు ముర్షిద్ రజ్వీ ఖురాన్ సందేశం వినిపించారు. రంజాన్ నెల రోజులూ నియమనిష్ఠలతో ఉపవాస దీక్షలు చేసిన వారిపై అల్లా కరుణ ఉంటుందన్నారు. ప్రార్థనలు పూర్తయ్యాక ఒకరినొకరు ఆత్మీయ ఆలింగనాలు చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండలంలోని కేశవరం, ద్వారపూడి ప్రాంతాల్లో రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.



వెదురుపాక మసీద్‌లో రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ద్రాక్షారామ పెద్ద మసీదులో ఈద్ నమాజ్ చేస్తున్న ముస్లింలు



మండపేట జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు